

దడ పుట్టాల్సిందే..

నేరాలకు పాల్పడిన వారికి శిక్ష పడేలా రామగుండం సీపీ ప్రత్యేక కార్యాచరణతో ముందు కెళ్తున్నారు. పక్కాగా సాక్ష్యాలు సేకరించి శిక్షల శాతం పెంచుతున్నారు. 8లో▸



'ఉపాధి'లో టాప్..!

ఉపాధిహామీ పథకం పనుల కల్పనలో తిర్యాణి మండలం జిల్లాలో మొదటిస్థానంలో నిలిచింది. గత ఆర్థిక సంవత్సరంలో 3.92 లక్షల పనిదినాలు కల్పించారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.8 /28.8

ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. వేడి గాలులు వీస్తాయి. ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్‌

పారదర్శకంగా అర్హుల జాబితా రూపకల్పన

ఆసిఫాబాద్‌అర్బన్‌: రాజీవ్‌ యువ వికాసం పథకంలో అందిన దరఖాస్తులను పరిశీలించి పారదర్శకంగా అర్హుల జాబితా రూపొందించాలని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీఆర్‌డీవో దత్తారావుతో కలిసి సోమవారం రాజీవ్‌ యువ వికాసం పథకంలో అందిన దరఖాస్తుల పరిశీలన, మార్గదర్శకాలపై ఎంపీడీవోలు, బ్యాంకు మేనేజర్లు, ఏపీఎంలు, కార్పొరేషన్‌ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ మండల ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో ఎంపీడీవోలు, బ్యాంకు మేనేజర్లు, కమిటీ సభ్యులు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హుల జాబితా రూపొందించాలన్నారు. మే 15 వరకు సర్వే పూర్తి చేసి జిల్లాస్థాయి కమిటీకి జాబితా అందించాలన్నారు. ఆధార్‌ కార్డు, రేషన్‌ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, తెలంగాణ ఆవిర్భావం తర్వాత పొందిన కుల ధ్రువీకరణ పత్రం, శాశ్వత డ్రైవింగ్‌ లైసెన్స్‌, పట్టా పాసుపుస్తకం, సదరం సర్టిఫికెట్లు పరిశీలించాలని ఆదేశించారు. జనాభా ప్రాతిపదికన యూనిట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. మండల కమిటీ నుంచి వచ్చిన జాబితాను మే 21 నుంచి 30 వరకు జిల్లా కమిటీ పరిశీలించి, రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్‌ 2న అర్హులకు మంజూరు పత్రాలు అందిస్తామన్నారు. సమావేశంలో డీటీడీవో రమాదేవి, ఎస్సీ కార్పొరేషన్‌ అధికారి సజీవన్‌, లీడ్‌ డిస్ట్రిక్ట్‌ మేనేజర్‌ రాజేశ్వరిజోషి పాల్గొన్నారు.

రేపు విద్యుత్‌ సమస్యల పరిష్కార వేదిక

ఆసిఫాబాద్‌: జిల్లా కేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఈ నెల 23న ఉదయం 10.30 గంటలకు విద్యుత్‌ సమస్యల పరిష్కార వేదిక సీజీఆర్‌ఎఫ్‌– 2 ఏర్పాటు చేయనున్నట్లు ట్రాన్స్‌కో డీఈ వీరేశం, ఏడీఈ ఫిరోజ్‌ఖాన్‌ సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్‌ సీజీఆర్‌ఎఫ్‌– 2 చైర్మన్‌ ఎరుకల నారాయణ హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతోపాటు ఆసిఫాబాద్‌, వాంకిడి, రెబ్బెన మండలాలకు చెందిన విద్యుత్‌ వినియోగదారులు సమస్యలుంటే ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

- ఉమ్మడి జిల్లాలో వికసిస్తూ.. ముళ్లను సైతం ముద్దాడుతూ
- తొలి ఎన్నికల నుంచే సత్తా చాటిన ఉద్యమ పార్టీ
- 'తెలంగాణ' ఏర్పాటు తర్వాత రెండుసార్లు ప్రభంజనం
- మొన్నటి ఎన్నికల్లో మాత్రం ప్రతికూలం
- కేడర్‌పైనే కీలక నేతల ధీమా
- రజతోత్సవ వేళ శ్రేణుల్లో మళ్లీ ఉత్సాహం
- బీఆర్‌ఎస్‌ 25 ఏళ్ల ప్రస్థానం ఆసక్తికరం



పాతికేళ్ల గులాబీ

సాక్షి, ఆదిలాబాద్‌: భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్‌) రజతోత్సవానికి సిద్ధమైంది. ఈ నెల 27న వరంగల్‌లో భారీ మహాసభకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు పార్టీ కేడర్‌ సన్నద్ధమవుతోంది. 25 ఏళ్ల ఆ పార్టీ ప్రస్థానంలో రాష్ట్రంలో మాదిరే జిల్లాలోనూ అనేక ఆటుపోట్లను ఎదుర్కొంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత గులాబీ పార్టీ రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోనూ పటిష్టంగా రూపొందింది. అయితే గత ఎన్నికల్లో ఓటమితో కొంత నైరాశ్యం చోటు చేసుకుంది. పలువురు నేతలు పార్టీని వీడినా పునాది లాంటి కార్యకర్తలు వెన్నంటే ఉన్నారన్న అభిప్రాయం నాయకత్వంలో ధీమా నింపుతోంది. పార్టీ రజతోత్సవం తర్వాత మరింత ఉత్సాహం చోటు చేసుకోనుందని, రానున్న రోజుల్లో కేసీఆర్‌ పాలననే ప్రజలు కోరుకుంటున్నారని ఆ పార్టీ శ్రేణులు నర్మగర్భంతో పేర్కొంటున్నారు.

మొదటి ఎన్నికలతోనే ప్రభంజనం..

బీఆర్‌ఎస్‌ (అప్పటి టీఆర్‌ఎస్‌) పార్టీ 2001 ఏప్రిల్‌ 27న ఏర్పడింది. 2004 సార్వత్రిక ఎన్నికల్లో మొదటిసారి రాష్ట్రంలో పోటీ చేసింది. తెలంగాణలో 26 సీట్లలో గెలుపొందింది. ఉమ్మడి జిల్లాలో ఆ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ ముథోల్‌ నుంచి నారాయణరావు పటేల్‌, బోథ్‌ నుంచి సోయం బాపూరావు, ఖానాపూర్‌ నుంచి అజ్మీరా గోవింద్‌ నాయక్‌ గెలుపొందారు. పార్లమెంట్‌ ఎన్నికల్లో నాడు ఆదిలాబాద్‌ ఎంపీ జనరల్‌ స్థానంగా ఉండగా, అప్పట్లో గులాబీ పార్టీ నుంచి టి.మధుసూదన్‌రెడ్డి ఎంపీగా పోటీ చేసిన మధుసూదన్‌రెడ్డి, ఖానాపూర్‌లో తిరిగి పోటీ చేసిన గోవింద్‌ నాయక్‌ ఇద్దరూ ఓటమి చెందారు. దీంతో జిల్లాలో పార్టీ పరిస్థితి కొంత డీలా పడింది.

మళ్లీ పుంజుకున్న వైనం..

2009 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్‌కు చెన్నూర్‌ నుంచి నల్లాల ఓదెలు, మంచిర్యాల నుంచి గడ్డం అరవింద్‌రెడ్డి, సిర్పూర్‌ నుంచి కావేటి సమ్మయ్య గెలుపొందారు. దీంతో పార్టీ మళ్లీ పుంజుకుంది. ఆ తర్వాత ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమం తీవ్రరూపం దాల్చడం, సబ్బండ వర్గాలు కలిసి రావడంతో బీఆర్‌ఎస్‌కు కలిసి వచ్చింది. అప్పట్లో కేసీఆర్‌ ఆదేశాల మేరకు ఎమ్మెల్యేలు రాజీనామా చేయగా, తిరిగి ఉప ఎన్నికల్లో ఆ మూడు స్థానాల నుంచి గెలుపొందింది. ఈ విధంగా పార్టీ తన స్థానాన్ని పదిలపర్చుకుంది. రాజకీయ సుస్థిరత సాధించింది. 2009 ఎన్నికల్లో ఆదిలాబాద్‌ నియోజకవర్గం నుంచి టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన జోగు రామన్న మధ్యలో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ నేపథ్యంలో ప్రజల అభీష్టం మేరకు ఆ పార్టీకి రాజీనామా చేసి 2012లో బీఆర్‌ఎస్‌లో చేరారు. గులాబీ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. దీంతో ఎమ్మెల్యేల సంఖ్య నాలుగుకు పెరగగా ఉమ్మడి జిల్లాలో పార్టీ బలంగా మారింది.

గెలుపొందారు. ఈ విధంగా ఆ పార్టీ ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్‌ పార్లమెంట్‌తోపాటు మూడు అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుంది.

అప్పట్లోనే అసమ్మతి వర్గం..

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అధినేత కేసీఆర్‌ నాడు పార్టీ నుంచి గెలిచిన ప్రజాప్రతినిధులందరినీ రాజీనామా చేయాలని కోరారు. అయితే అప్పట్లో ఎంపీ మధుసూదన్‌రెడ్డి, ఖానాపూర్‌ ఎమ్మెల్యే గోవింద్‌నాయక్‌ కేసీఆర్‌కు మద్దతుగా రాజీనామా చేయగా, బోథ్‌ నుంచి గెలుపొందిన సోయం బాపూరావు, ముథోల్‌ నుంచి గెలుపొందిన నారాయణరావు పటేల్‌ అసమ్మతి వర్గంగా నిలిచారు. దీంతో మొదటి ఎన్నికల తర్వాత రాష్ట్రంలో, ఇటు జిల్లాలోనూ అసమ్మతి వర్గం కారణంగా పార్టీకి గడ్డు పరిస్థితులు ఎదురయ్యాయి. ఉప ఎన్నికల్లో మళ్లీ

ఇక వెనుదిరిగి చూడని వైనం..

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడటం, బీఆర్‌ఎస్‌కు ప్రజల్లో ఆదరణ పెరగడంతో ఇతర పార్టీల్లోని ముఖ్య నేతలంతా బీఆర్‌ఎస్‌లోకి వలస వచ్చారు. దీంతో పార్టీ బలంగా తయారైంది. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ దూసుకుపోయింది. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా జెడ్పీని సైతం కైవసం చేసుకుంది. మున్సిపాలిటీల్లోనూ పాగా వేసింది. 2014 ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో బీఆర్‌ఎస్‌ ఏకంగా ఏడు స్థానాల్లో గెలుపొందింది. నిర్మల్‌, సిర్పూర్‌లో ఐకే రెడ్డి, కోనప్పలు బీఎస్పీ నుంచి గెలుపొంది ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆ ఎన్నికల్లో ముథోల్‌ నుంచి ఏకైక స్థానం గెలుపొందిన కాంగ్రెస్‌ ఎమ్మెల్యే విఠల్‌ రెడ్డి కూడా ఆ తర్వాత కాలంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ విధంగా పూర్తిగా ఉమ్మడి జిల్లా గులాబీమయంగా తయారైంది. 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ ఉమ్మడి జిల్లాలో ఏకంగా తొమ్మిది స్థానాల్లో గెలుపొందగా, ఆసిఫాబాద్‌ నుంచి కాంగ్రెస్‌ తరఫున పోటీచేసిన ఆత్రం సక్కు గెలుపొందారు. ఆ తర్వాత ఆయన కూడా గులాబీ పార్టీలో చేరడంతో పదికి పది స్థానాలు బీఆర్‌ఎస్‌ హస్తగతం అయ్యాయి. ఈ విధంగా ఉద్యమకాలంలో ఉమ్మడి జిల్లాలో గులాబీ పార్టీ మొదట్లో ఆటుపోట్లు ఎదుర్కొన్నా, ప్రత్యేక రాష్ట్రంలో తిరుగులేని పార్టీగా అవతరించింది.

కలిసిరాని కాలం..

అయితే 2023 ఎన్నికలు బీఆర్‌ఎస్‌కు కలిసి రాలేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండుసార్లు అధికారంలో ఉన్న గులాబీ పార్టీకి ఒక విధంగా ఎదురుదెబ్బ తగిలింది. ఉమ్మడి ఆదిలాబాద్‌లో కేవలం బోథ్‌, ఆసిఫాబాద్‌ నియోజకవర్గాల్లోనే ఆ పార్టీ అభ్యర్థులు అనిల్‌ జాదవ్‌, కోవ లక్ష్మి గెలుపొందారు. ఇదిలా ఉంటే మొదటి నుంచి పార్లమెంట్‌ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే.. ఆదిలాబాద్‌ పరంగా 2004లో మధుసూదన్‌ రెడ్డి, 2014లో గోడం నగేష్‌ గులాబీ పార్టీ నుంచి ఎంపీలుగా గెలిచారు. ఇక పెద్దపల్లి నుంచి 2014లో బాల్క సుమన్‌, 2019లో వెంకటేశ్‌ నేత ఎంపీలుగా మారారు. ఉమ్మడి జిల్లాలో జెడ్పీ చైర్మన్‌గా వల్లకొండ శోభారాణి సత్యనారాయణ గౌడ్‌, ఆ తర్వాత రాథోడ్‌ జనార్దన్‌ వ్యవహరించారు. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత నాలుగు జెడ్పీలు ఏర్పడగా, ఈ నాలుగింటిలోనూ బీఆర్‌ఎస్‌ పాగా వేసింది. అయితే గత ఎన్నికల్లో చేదు ఫలితాలు ఎదురు కావడం, ఈ క్రమంలో పార్టీని పలువురు నేతలు వీడినా కార్యకర్తలు మాత్రం వెన్నంటే ఉన్నారనే ధీమా గులాబీ ముఖ్యనేతల్లో వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లా నుంచి 30 వేల మంది



ఆసిఫాబాద్‌: ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్‌ సిల్వర్‌జూబ్లీ వేడుకలకు ఉమ్మడి జిల్లా నుంచి 30 వేల మందిని తరలించనున్నాం. ఆసిఫాబాద్‌ నియోజకవర్గం నుంచి 350 ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేస్తున్నాం. అధిష్టానం ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలి.

– కోవ లక్ష్మి, ఆసిఫాబాద్‌ ఎమ్మెల్యే

భూ సమస్యల పరిష్కారానికి భూభారతి



మాట్లాడుతున్న కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే, పక్కన ఎమ్మెల్సీ విఠల్‌, ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్‌: భూ సమస్యల పరిష్కారం కోసం భూభారతి నూతన ఆర్‌వోఆర్‌ చట్టాన్ని తీసుకువచ్చినట్లు కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే తెలిపారు. కాగజ్‌నగర్‌ మండలం వంజిరీలోని రైతు వేదికలో భూభారతి చట్టంలోని హక్కులు, అంశాలపై సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఎమ్మెల్సీ దండె విఠల్‌, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్‌ మాట్లాడుతూ భూభారతి ద్వారా రికార్డుల్లో తప్పులను తహసీల్దార్‌ కార్యాలయంలో సరిచేసుకునే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ ధరణి చట్టంతో కేసీఆర్‌ కుటుంబం మాత్రమే బాగుపడిందని ఆరోపించారు. కొత్త భూభారతి చట్టంలో అప్పీల్‌ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఎమ్మెల్సీ దండె విఠల్‌ మాట్లాడుతూ ఒక్క రూపాయి ఖర్చు లేకుండా భూభారతి పోర్టల్‌లో రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అదనపు కలెక్టర్‌ ఎం.డేవిడ్‌, కాగజ్‌నగర్‌ సబ్‌ కలెక్టర్‌ శ్రద్ధా శుక్లా, తహసీల్దార్‌ కిరణ్‌, డీఏవో శ్రీనివాసరావు, ఏవో రామకృష్ణ పాల్గొన్నారు.

'భూభారతి'పై అవగాహన అవసరం

సిర్పూర్‌(టి): భూభారతి ఆర్‌వోఆర్‌ చట్టంపై ప్రతిఒక్కరికి అవగాహన అవసరమని ఎమ్మెల్సీ దండె విఠల్‌, కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అదనపు కలెక్టర్‌ డేవిడ్‌, కాగజ్‌నగర్‌ సబ్‌ కలెక్టర్‌ శ్రద్ధా శుక్లా, తహసీల్దార్‌ శ్రీనివాస్‌, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఓపెన్‌' పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్‌: జిల్లాలో ఓపెన్‌ పదో తరగతి, ఇంటర్మీడియెట్‌ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం నిర్వహించిన ఓపెన్‌ పదో తరగతి పరీక్షకు 316 మంది విద్యార్థులకు 288 మంది హాజరు కాగా 28 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌ పరీక్షకు 176 మందికి 164 మంది హాజరు కాగా 12 గైర్హాజరయ్యారని జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు తెలిపారు.

రచ్చకెక్కుతున్న భూవివాదాలు

చింతలమానెపల్లి మండలం బాబాసాగర్‌లో దండ్రె అంకుబాయికి చెందిన భూమిని పాత పహాణీ చూపించి పట్టా చేయించుకున్నారు. ఫోరెన్సిక్‌ ఆడిట్‌ నిర్వహించి ఆ మహిళా రైతుకు న్యాయం చేయాలని సిర్పూర్‌ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అసెంబ్లీలో డిమాండ్‌ చేశారు. స్వయానా ఎమ్మెల్యే మండలంలోని భూవివాదాలపై అసెంబ్లీలో ప్రస్తావించడం చర్చనీయంగా మారింది. గడిచిన పదేళ్లలో ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని కొంతమంది భూములను అక్రమంగా పట్టాలు చేసుకోవడాన్ని ఎమ్మెల్యే ప్రశ్నిస్తూ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు.

చింతలమానెపల్లి మండలం బాలాజీ అనుకోడకు చెందిన నీలం అశోక్‌కు 65/193/3 సర్వేనంబర్‌లో ఎకరం భూమి ఉంది. ఈ భూమి అసైన్డ్‌ పట్టా కాగా 2022 తర్వాత ఇతరులకు అక్రమంగా పట్టా మారింది. సదరు యువరైతు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోకపోవడంతో కోర్టును ఆశ్రయించాడు. జిల్లా కలెక్టర్‌ స్పందించి అక్రమంగా పట్టా మార్పిడి చేసిన అప్పటి తహసీల్దార్‌ ముష్కూర్‌ అలీపై వేటు వేస్తూ చర్యలు తీసుకున్నారు... ఇలా చింతలమానెపల్లి మండలంలో భూవివాదాలు రచ్చకెక్కుతున్నాయి. నిత్యం భూవివాదాలు, అక్రమాలు కొత్తగా వెలుగులోకి వస్తున్నాయి.

- 'చింతలమానెపల్లి'లో అక్రమంగా భూ బదలాయింపులు
- తహసీల్దార్‌ కార్యాలయమే కేంద్రం!
- పలువురు అధికారులపైనా చర్యలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: 2014లో కౌటాల, బెజ్జూర్‌, సిర్పూర్‌(టి) మండలాల్లోని పలు గ్రామ పంచాయతీలతో చింతలమానెపల్లి కేంద్రంగా కొత్త మండలాన్ని ఏర్పాటు చేశారు. గూడెం, చింతలమానెపల్లి, ఖర్జెల్లి, బాబాసాగర్‌, రవీంద్రనగర్‌, బాలాజీ అనుకోడ, డబ్బాలో భూములకు డిమాండ్‌ పెరిగింది. ఈక్రమంలో భూవివాదాలు ప్రారంభయ్యాయి.

మాజీ ప్రజాప్రతినిధిపై ఆరోపణలు

గూడెంలో మహారాష్ట్ర సరిహద్దుకు సమీపంలో ప్రధాన రహదారి పక్కన మార్కెట్‌లో ఓ భూమి విషయంలో వివాదం చోటుచేసుకోవడం స్థానికంగా సంచలనంగా మారింది. ఈవివాదంలో రెండు మండలాలకు చెందిన మండలస్థాయి నేతలు ఉన్నారని ప్రచారం జరుగుతోంది. యజమానులకు తెలియకుండానే పట్టా చేసుకోవడంతోపాటు ఒక సర్వే నంబర్‌ భూమిని మరోచోట చూపించి భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించారు. సదరు రైతులు సబ్‌కలెక్టర్‌ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అసైన్డ్‌ పట్టాను తమకు తెలియకుండా పట్టా చేయడంపై మండలస్థాయి మాజీ ప్రజాప్రతినిధిపై బాధితులు పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశారు.

భూవివాదాలు ఇలా..

- 2023 సంవత్సరంలో గంగాపూర్‌లో 15మంది 40గుంటల ఇంటి స్థలాలు కొన్నారు. తహసీల్దార్‌ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌ కోసం గుంటకు రూ.1500 చొప్పున అదనంగా ఇవ్వాలని అప్పటి తహసీల్దార్‌ నాగరాజు డిమాండ్‌ చేశారు. గ్రామ సర్పంచ్‌ గోమాసె విలాస్‌ను సైతం లంచం కోసం వేధించడంతో తహసీల్దార్‌ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు.
- డబ్బాలో ఆదివాసీ మహిళా రైతు కుమురం పద్మ తన భర్త పేరిట 174/1/21/4 సర్వేనంబర్‌లో ఉన్న ఎకరం 10గుంటల భూమి ఆక్రమణకు గురైందని కలెక్టరేట్‌లో మార్చి 21న ఫిర్యాదు చేసింది.
- బాలాజీ అనుకోడ గ్రామ శివారులో 65/348 సర్వేనంబర్‌లోని అసైన్డ్‌ భూమిని మండలస్థాయి ఓ మాజీ ప్రజాప్రతినిధి, ఆయన భార్య పేరుమీద అక్రమంగా పట్టాలు చేయించుకుని ఆక్రమించుకున్నారని ఆరోపిస్తూ బాధిత రైతు కామెర శంకరయ్య కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశాడు.

అసైన్డ్‌ భూములకు పట్టాలు

చింతలమానెపల్లి మండలంలో భూముల అక్రమాల్లో ప్రధానంగా అసైన్డ్‌(లావణి పట్టా) భూముల వివాదాలే ఎక్కువగా నమోదవుతున్నాయి. అసైన్డ్‌ భూములు వారసత్వంగా మాత్రమే సంక్రమిస్తాయి. కానీ అసైన్డ్‌ భూములు వారసులకు కాకుండా ఇతరులకు పట్టాలు కావడం గమనార్హం. తహసీల్దార్‌ కార్యాలయంలో అధికారులు సైతం అక్రమాలకు పాల్పడినట్లు స్పష్టమవుతోంది. సంబంధిత రైతు బతికి ఉండగానే మరణ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి తప్పుడు సాక్షులను ప్రవేశపెట్టి భారీస్థాయిలో అవినీతికి పాల్పడినట్లుగా తెలుస్తోంది. గూడెం శివారులో 167/49/1 పట్టాదారు కొంపరి చిరంజీవికి అసైన్డ్‌ భూమిగా ఉండగా, అనువంశికంగా ద్వారా తాత కొంపరి ధర్మయ్య నుంచి వారసత్వంగా వచ్చింది. అదే సర్వేనంబర్‌లోని 167/49/ఎ మాత్రం మండలస్థాయి మాజీ ప్రజాప్రతినిధికి బందోబస్తు పట్టాగా మారింది. ఈ లావాదేవి అక్రమాల తీరును తెలియజేస్తోంది. రాజకీయ అండదండలతో బెదిరింపులకు పాల్పడుతుండడంతో బాధితులు పోలీస్‌స్టేషన్లను ఆశ్రయిస్తున్నారు.

పట్టా ఇప్పించాలి



గూడెం శివారులోని చెరువు సమీపంలో సర్వే నం. 167/49లో మా తాత కొంపరి ధర్మయ్య పేరుమీద 4.90 ఎకరాల అసైన్డ్‌ పట్టా ఉంది. మా తాత 2010లో చనిపోయాడు. 2009లో 2.45 ఎకరాల భూమి వారసత్వంగా వచ్చింది. కానీ 2021లో నేను బతికి ఉండగానే ఆ భూమిని మాజీ ప్రజాప్రతినిధి పేరుమీద పట్టా చేశారు. ఉన్నతాధికారులు స్పందించి పట్టా ఇప్పించాలి. – కొంపరి కొండయ్య, గూడెం

ఆక్రమించుకునే ప్రయత్నం



గూడెం శివారులో సర్వే నం.167/168లో మా తాత డోకె లస్మయ్య పేరుమీద నాలుగెకరాల పట్టా భూమి ఉంది. ఈ భూమిని ఓ మాజీ ప్రజాప్రతినిధి తన అనుచరులతో వచ్చి ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారు. పలుమార్లు బెదిరింపులకు పాల్పడ్డారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

– డోకె మహేశ్‌, గూడెం

బాధితులకు న్యాయం చేస్తున్నాం

మండలంలో భూముల బదలాయింపులో అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తున్నాం. బాధితులు తహసీల్దార్‌ కార్యాలయంలో సంప్రదించాలి. ప్రభుత్వ నిబంధనల మేరకు న్యాయం చేస్తాం. గూడెం శివారులో భూమి వివాదంపై ఉన్నతాధికారులు కోరిన నివేదికను అందించాం. – మునావర్‌ షరీఫ్‌, తహసీల్దార్‌, చింతలమానెపల్లి

వినతుల వెల్లువ

- ప్రజావాణికి తరలివచ్చిన బాధితులు
- అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి



అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారికి సమస్య విన్నవిస్తున్న వృద్ధుడు

ఆసిఫాబాద్‌అర్బన్‌: 'భూ సమస్యలు పరిష్కరించండి. కార్యాలయాల చుట్టూ తిరగలేకపోతున్నాం'.. 'ఉపాధి కల్పించండి పనిచేసుకుంటాం'.. 'ఆసరా పింఛన్‌ ఇప్పించండి'.. ఇలా జిల్లా నలుమూలల నుంచి బాధితులు సమస్యలు చెప్పుకునేందుకు కలెక్టరేట్‌కు క్యూ కట్టారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వితంతు పింఛన్‌ మంజూరు చేయాలని రెబ్బెన మండలం ఎడవల్లి గ్రామానికి చెందిన రాథోడ్‌ సుజాత, సిర్పూర్‌(టి) మండల కేంద్రానికి చెందిన మచ్చ సుశీల వేర్వేరుగా వినతులు సమర్పించారు. తాను కొనుగోలు చేసిన భూమిని ఇతరులు పట్టా మార్పిడి చేసుకున్నారని, ఆ పట్టా రద్దు చేసి న్యాయం చేయాలని చింతలమానెపల్లి మండలం రణవెల్లికి చెందిన చిట్యాల శంకర్‌ కోరారు. ఆసిఫాబాద్‌ మండలం జెండాగూడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే రహదారిని కొంతమంది ఆక్రమించారని, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని దుర్గం ధర్మయ్య ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఉన్న భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టా పాసుపుస్తకం మంజూరు చేయాలని చింతలమానెపల్లి మండలం రణవెల్లికి చెందిన భట్టుపల్లి చంద్రయ్య అర్జీ అందించాడు. తన భర్త మరణించాడని, పింఛన్‌ ఇప్పించాలని ఆసిఫాబాద్‌ మండలం సాలెగూడకు చెందిన లక్ష్మీబాయి కోరింది. పింఛన్‌ పునరుద్ధరించాలని దహెగాం మండలం ఇట్యాల గ్రామానికి చెందిన శంకర్‌ దరఖాస్తు చేసుకున్నాడు. అనంతరం అదనపు కలెక్టర్‌ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులు వేగంగా ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేతనం పెంచండి



నేను కెరమెరి ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో అటెండర్‌గా పనిచేస్తున్నా. నెలనెలా రూ.4,500 వేతనం చెల్లిస్తున్నారు. ప్రస్తుతం ఇస్తున్న వేతనంతో కుటుంబాన్ని పోషించుకోలేకపోతున్నా. కనీసం రూ.10వేల వేతనం ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలి. – విలాస్‌, ఆసిఫాబాద్‌

అక్రమంగా విక్రయించారు



ఆసిఫాబాద్‌ మండలం కమ్మర్‌పల్లి శివారులో భూమిని నా ఆడపడుచులు అక్రమంగా విక్రయించారు. ఆ భూమికి పట్టా ఇవ్వకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. నా భర్త మతిస్థిమితం లేకపోవడాన్ని ఆసరాగా తీసుకుని మోసం చేస్తున్నారు. అధికారులు అత్తామామల నుంచి రావాల్సిన భూమిని ఇప్పించాలి.

– ఉమాదేవి, దహెగాం

యూడీఐడీ ఇప్పించాలి



నాకు ఒక కన్ను పూర్తిగా కనిపించదు. ప్రస్తుతం సదరం క్యాంపులు నిర్వహించకపోవడంతో దివ్యాంగ ధ్రువపత్రం పొందే అవకాశం లేకుండా పోయింది. గతంలో సదరం క్యాంపునకు హాజరైతే 38 శాతం వైకల్యం గుర్తించారు. ప్రస్తుతం కంటి లోపం 60శాతం లోవిజన్‌ సర్టిఫికెట్‌ ఉన్నందున ప్రభుత్వం యూడీఐడీ స్లాట్‌ బుకింగ్‌ ప్రారంభించాలి. దివ్యాంగ సర్టిఫికెట్‌ లేకపోవడంతో ఉన్నత చదువులకు నష్టం కలుగుతుంది.

– భావని, కాగజ్‌నగర్‌

ఆన్‌లైన్‌ కాలేదు



కాగజ్‌నగర్‌ మండలం జగన్నాథ్‌పూర్‌ శివారులోని 88/1/ సర్వే నంబర్‌లో ఎకరం భూమిని, భట్టుపల్లి శివారులోని 248/అ/2లో ఎకరం భూమి 2022లో కొనుగోలు చేశా. ఆ సమయంలో రిజిస్ట్రేషన్‌ కూడా అయ్యింది. కానీ భూమి ఆన్‌లైన్‌ కాక పట్టాపాస్‌ పుస్తకం లేదు. త్వరగా పట్టా పాస్‌పుస్తకం ఇప్పించాలి. – మొండి, అందవెల్లి

పెండింగ్‌ వేతనాలు చెల్లించాలని వినతి

ఆసిఫాబాద్‌రూరల్‌: బీసీ వసతిగృహాల్లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌ వేతనాలు చెల్లించాలని సోమవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమశాఖ అధికారి సజీవన్‌కు వినతిపత్రం అందించారు. ఆ సంఘం రాష్ట్ర నాయకుడు బ్రహ్మానందం మాట్లాడుతూ జిల్లాలోని బీసీ వసతిగృహాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్‌ వర్కర్లకు 12 నెలలుగా వేతనాలు రావడం లేదన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి పెండింగ్‌ వేతనాలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో నిరవధిక సమ్మెకు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కొమురయ్య, పార్వతి, లక్ష్మి, జ్యోతి, శారద, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

క్లుప్తంగా

టేకుచెట్లు నరికిన ఇద్దరికి రిమాండ్



నిందితులతో అటవీ సిబ్బంది

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ పైడిపెల్లి బీట్‌లో టేకు చెట్లు నరికిన ఇద్దరికి న్యాయమూర్తి 14రోజుల రిమాండ్ విధించినట్లు సెక్షన్ అధికారి శివకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పుట్టిగూడకు చెందిన పెంద్రం శ్రీనివాస్, వెద్మ మధుకర్ చింతగూడ సెక్షన్, పైడిపెల్లి బీట్‌లో టేకు చెట్లు నరికారు. వారిని సోమవారం అరెస్ట్ చేసి లక్సెట్టిపేట కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. బీట్ అధికారులు శ్రీనివాస్, లాలుబాయి ఉన్నారు.

బైక్ పైనుంచి పడి ఒకరికి గాయాలు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఆదివారం రాత్రి బైక్‌పై వెళ్తున్న ఒకరు ప్రమాదవశాత్తు అదుపు తప్పి కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాసిపేట మండలం ధర్మరావుపేటకు చెందిన హన్మాండ్ల సాగర్ (29) చున్నంబట్టిలోని ఓ బైక్ మెకానిక్ వద్ద మెకానిక్‌గా పని చేస్తుండేవాడు. రాత్రి పని ముగించుకుని చున్నంబట్టివాడ నుంచి మంచిర్యాల వైపునకు వస్తుండగా ఫ్లైఓవర్ బ్రిడ్జిపై అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో సాగర్ తల డివైడర్‌కు బలంగా తాకడంతో తీవ్ర గాయలయ్యాయి. వెంటనే స్థానికులు అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తీసుకువెళ్లారు. సాగర్ హెల్మెట్ ధరించి ఉంటే తలకు దెబ్బ తగిలేది కాదని స్థానికులు తెలిపారు. ఘటనపై పోలీసులను సంప్రదిస్తే ఫిర్యాదు అందలేదన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామానికి చెందిన మాగిని రాజు సోమవారం కుటుంబీకులతో కలిసి పనులకు బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో టీవీ, ఫ్యాన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. అగ్ని ప్రమాదం సంభవించిన క్షణాల్లోనే ఇంటి చుట్టూ మంటలు వ్యాపించాయి. మంటల్లో బట్టలు, నిత్యావసరాలు కాలిబూడిదయ్యాయి. సాయంత్రం వచ్చిన రాజు, కుటుంబీకులు ఇంట్లోంచి పొగ రావడం గమనించారు. లోనికి వెళ్లి చూడగా సామగ్రి కాలిబూడిదైంది. చుట్టు పక్కల వారు మంటలు ఆర్పేశారు. సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

అడవిపంది దాడిలో కూలీకి గాయాలు

ఇంద్రవెల్లి: అడవిపంది దాడిలో ఉపాధి కూలీకి గాయాలయ్యాయి. వివరాలు.. మండలంలోని కేస్లాగూడ గ్రామానికి చెందిన హెరేకుమ్ర శ్రీకాంత్ సోమవారం ఉదయం ఓ రైతు వ్యవసాయ చేనులో చేపట్టిన ఉపాధి పనికి తోటి కూలీలతో వెళ్లాడు. ఈ క్రమంలో అకస్మాత్తుగా వెనుక నుంచి అడవిపంది దాడి చేయగా గాయపడ్డాడు. తోటి కూలీలు గమనించి అడవిపందిని తరిమికొట్టారు. గాయాలైన శ్రీకాంత్‌ను వెంటనే 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతున్నాడు.

నేరం చేయాలంటే దడ పుట్టాల్సిందే..

- ప్రత్యేక కార్యాచరణ చేపట్టిన సీపీ
- నిందితులకు శిక్ష పడటమే లక్ష్యం
- పకడ్బందీగా సాక్ష్యాధారాల సేకరణ
- ఏడాదిలో 135 మందికి జైలు శిక్ష
- ఈ ఏడాది శిక్షలు పెంచేలా చర్యలు



సమావేశానికి హాజరైన పోలీస్ అధికారులు (ఫైల్)



చెక్‌బౌన్స్ కేసులో ప్రతిభ కనబరిచిన కోర్టు కానిస్టేబుల్‌కు అవార్డు ఇస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా(ఫైల్)

మంచిర్యాలక్రైం: ఒక్కసారి నేరం చేసినవారు మరోసారి నేరాలకు పాల్పడకుండా వారికి సరైన శిక్ష పడేలా రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. ఎఫ్ఐఆర్ నమోదు నుంచి నిందితుడికి శిక్ష పడేదాకా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పక్కాగా సాక్ష్యాలు సేకరించి శిక్షల శాతాన్ని పెంచుతున్నారు. ఇప్పటికే పలుసార్లు కమిషనరేట్ పోలీస్ అధికారులు, కోర్టు డ్యూటీ నిర్వహిస్తున్న కానిస్టేబుల్, లైజన్ ఆఫీసర్లతో సీపీ సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. 2024లో రామగుండం కమిషనరేట్ పరిధిలో 80 కేసుల్లో 135 మంది నిందితులకు శిక్ష పడేలా చేశారు. పెద్దపల్లి జిల్లాలో రెండు కేసుల్లో ముగ్గురికి యావజ్జీవ కారాగారం, మరో రెండు కేసుల్లో ఆరుగురికి పదేళ్ల జైలు, మంచిర్యాల జిల్లాలో మూడు కేసుల్లో ముగ్గురికి ఐదేళ్ల శిక్ష పడేందుకు కృషి చేశారు.

శిక్షలు పడిన ఘటనలు కొన్ని..

- 2016 సెప్టెంబర్ 17న మంచిర్యాల ఠాణా పరిధిలోని ఘడ్‌పూర్ పంచాయతీ పరిధి బాబానగర్‌కు చెందిన సంద్ర లక్ష్మణ్, అనిల్, అశోక్‌ను అదే గ్రామానికి చెందిన మనుబోతుల శ్రీనివాస్ గొడ్డలి, కత్తితో దాడి చేసి గాయపరిచాడు. అప్పటి ఎస్సై వేణుగోపాల్ రావు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి న్యాయమూర్తి అర్పిత మారంరెడ్డి ఎదుట పీపీ మదన్‌మోహన్‌రావు కోర్టులో సాక్ష్యాలు ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. దీంతో శ్రీనివాస్‌కు ఐదేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ 2024 మే 8న తీర్పునిచ్చారు.
- 2022లో మంచిర్యాల జిల్లా కన్నెపెల్లి ఠాణా పరిధి సుర్జాపూర్‌కు చెందిన దాసరి శ్రీనివాస్, రాజన్న బైక్‌పై వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన పూదరి చంద్రశేఖర్ తన ట్రాక్టర్‌తో బైక్ ఎక్కించి గొడ్డలితో నరికి చంపుతానని బెదిరించాడు. ఫిర్యాదు అందుకున్న అప్పటి ఎస్సై గంగారాం కేసు నమోదు చేశారు. కోర్టులో నేరం రుజువు కాగా అప్పటి న్యాయమూర్తి అర్పిత మారంరెడ్డి చంద్రశేఖర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.
- 2017 అక్టోబర్ 21న జిల్లాలోని లక్సెట్టిపేట ఠాణా పరిధి ఇందిరానగర్‌లో ఇంటి ప్రహరీ విషయంలో మామిడి మల్లయ్య, దుంపల బంగారమ్మకు గొడవ జరిగింది. బంగారమ్మ, ఆమె కుమారులు సురేశ్, నరేశ్ మల్లయ్య కుమారులు చంద్రమౌళి, రాజగోపాల్, కృష్ణంరాజుపై తల్వార్లతో దాడి చేయగా చంద్రమౌళి మృతి చెందాడు. రాజగోపాల్, కృష్ణంరాజును గాయపరిచారు. ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. బంగారమ్మ, నరేశ్, సురేశ్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ అప్పటి న్యాయమూర్తి డీ వెంకటేశ్ 2022 జనవరి 8న తీర్పునిచ్చారు.

నేరస్తులు తప్పించుకోలేరు



నేరం చేసిన వారు చట్టం చేతి నుంచి తప్పించుకోలేరు. సీసీ ఫుటేజీ, వేలిముద్రలు, సెల్‌ఫోన్ కాల్‌డేటా, ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టు, ఇతర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నాం. పంచనామా సమయంలో సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాన్ని వీడియో రికార్డ్ చేసి కోర్టుకు అందజేస్తున్నాం. నేర దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన అధికారులకు రివార్డులిస్తూ ప్రోత్సహిస్తున్నాం.

– ఎగ్గడి భాస్కర్, డీసీపీ, మంచిర్యాల

కాంట్రాక్ట్ లెక్చరర్ల నిరవధిక సమ్మె



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

బాసర: యుటాక్ స్టేట్ అసోసియేషన్ పిలుపుమేరకు నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు సోమవారం నిరవధిక సమ్మె ప్రారంభించారు. 17 ఏళ్లుగా పని చేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీశైలం మాట్లాడారు. బాసర ఆర్జీయూకేటీ కాంట్రాక్ట్ అధ్యాపకులతో ప్రారంభమైందని, విశ్వవిద్యాలయ పురోగతికి తమవంతు కృషి చేస్తున్నామని తెలిపారు. కాంట్రాక్ట్ వ్యవస్థకు ముగింపు పలికి విశ్వవిద్యాలయాల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్, డాక్టర్ విజయ్‌కుమార్, మందా సతీశ్‌కుమార్, డాక్టర్ రాములు, శ్రీధర్, తిలక్‌రెడ్డి, భానుప్రియ, రమాదేవి, ప్రశాంతి, రజితారెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

13వ రోజుకు అసిస్టెంట్ ప్రొఫెసర్ల దీక్ష



ఎండలో నిల్చున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ఆర్జీయూకేటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేపట్టిన నిరవధిక నిరసన దీక్ష సోమవారం 13వ రోజుకు చేరింది. తమకు అదనపు బాధ్యతలు వద్దని, రెగ్యులర్ చేయాలని, తమ సేవలు గుర్తించాలని ఆందోళన కొనసాగిస్తున్నారు. ఎర్రటి ఎండలో గొడుగులు పట్టుకుని విశ్వవిద్యాలయం ఆవరణలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఉపేంద్ర, కృష్ణప్రసాద్, ఖలీల్, డాక్టర్ కుమార్ రాగుల, డాక్టర్ విఠల్, ప్రకాశ్, డాక్టర్ రోషన్, డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ పావని, డాక్టర్ శ్వేత, డాక్టర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పండంటి బిడ్డకు జన్మనిచ్చి..



హేమశ్రీ (ఫైల్)

లక్ష్మణచాంద: పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చి అంతలోనే బాలింత ప్రాణాలు కోల్పోయిన విషాదకర ఘటన మండలంలోని మల్లాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, చుట్టుపక్కల వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బాపట్ల ఆశన్న-లలిత దంపతుల చిన్న కుమారుడు అరుణ్‌కు మూడేళ్ల క్రితం ఖానాపూర్‌కు చెందిన హేమశ్రీతో వివాహమైంది. ఏడాదిన్నర క్రితం హేమశ్రీ మొదటి సంతానంగా మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆదివారం నిర్మల్‌లోని ఓ ఆస్పత్రిలో రెండో సంతానంగా మరో మగబిడ్డను ప్రసవించింది. అంతలోనే హేమశ్రీకి గుండెపోటు వచ్చి ఆరోగ్యం విషమించిందని వైద్యులు కుటుంబీకులకు పిడుగులాంటి వార్త చెప్పారు. దీంతో హేమశ్రీ కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. మెరుగైన చికిత్స కోసం ఆమెను నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి హేమశ్రీ మృతి చెందినట్లు తెలిపారు. దీంతో మల్లాపూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. పుట్టిన బిడ్డను కూడా చూడకుండానే ఆ తల్లి కన్నుమూయగా ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు రోధించిన తీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.

‘పేదల ఆరోగ్యంపై వివక్ష ఎందుకు’



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): పేదల ఆరోగ్యంపై ఈ ప్రభుత్వాలకు వివక్ష ఎందుకని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్, ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ ప్రశ్నించారు. లక్ష కిలో మీటర్ల మా భూమి రథయాత్రలో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం జైనథ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనమని చెబుతూనే దొడ్డు బియ్యం భోజనం పెడుతున్నారని ఆరోపించారు. కోడి గుడ్లు కూడా ఇవ్వడం లేదని తెలిపారు. ఇదేనా విద్యార్థులకు అందించే నాణ్యమైన భోజనమని ప్రశ్నించారు. మరుగుదొడ్ల నిర్మాణం నాణ్యతగా లేదని పేర్కొన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. మందులు ఉన్నాయా.. లేవా.. అనే విషయాలను రోగుల ద్వారా తెలుసుకున్నారు. మా భూమి రథయాత్ర ద్వారా విద్య, వైద్యం, ఉపాధి రంగాలన్నింటినీ పరిశీలించి వాటి మెరుగుదల కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. పేదల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలతో పోరాడుతామని వివరించారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర నాయకుడు లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్, ఇతర నాయకులున్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పీవోకు అర్జీలు అందించారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. ప్రజావాణికి పింఛన్, డబుల్ బెడ్రూం, స్వయం ఉపాధి పథకాల కోసం, వ్యవసాయం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన 65 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వీటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి



వివరాలు సేకరిస్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

బోథ్: మండలంలోని నక్కలవాడ గ్రామానికి చెందిన నైతం భూమన్న (35) ఈ నెల 17న పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భూమన్న ఓ రైతు వద్ద పాలేరుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 17న మద్యం తాగి ఇంట్లో భార్య లక్ష్మితో గొడవ పడ్డాడు. దీంతో లక్ష్మి మందలించగా క్షణికావేశంలో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబీకులు బోథ్‌లోని సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, మూడేళ్ల కుమారుడున్నారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



చంద్రశేఖర్ (ఫైల్)

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన మునుగంటి చంద్రశేఖర్ (51) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రశేఖర్ ఈ నెల 20న పురోహితం ముగించుకుని ఎల్లారం గ్రామ స్టేజీ మీదుగా బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్‌కు బలమైన గాయాలు కాగా స్థానికులు లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించగా హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స అందిస్తుండగా సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కూతురు జాహ్నవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రక్తహీనతతో చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి



రిమ్స్‌లో సౌజన్య మృతదేహం

గుడిహత్నూర్: మండలంలోని తోషం గ్రామానికి చెందిన విద్యార్థిని బోరేకర్ సౌజన్య (15) రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సౌజన్య నేరడిగొండ మండలంలోని కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతోంది. కొద్ది నెలలుగా రక్త హీనతతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఆమె ఆరోగ్యం క్షీణించింది. వాంతులు, విరోచనాలు కావడంతో ప్రిన్సిపాల్ రజిత ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు రాకపోవడంతో రాత్రి 10.30 గంటలకు సిబ్బంది సౌజన్యను రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందింది. పాఠశాల సిబ్బంది మృతదేహాన్ని కుటుంబ సభ్యులు అప్పగించారు.

ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతోనే..

పాఠశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతోనే సౌజన్య మృతి చెందిందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ ఆరోపించారు. సౌజన్య కుటుంబీకులను ఆయన పరామర్శించారు. సౌజన్యను సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లకపోవడంతోనే మృతి చెందిందని పేర్కొన్నారు. సౌజన్య తండ్రి గతంలోనే మరణించగా తల్లి అనిత కూలీ పనులకు వెళ్లి ముగ్గురు పిల్లలను పోషిస్తోందని తెలిపారు. బాధిత కుటుంబానికి రూ.5లక్షల ఆర్థికసాయం అందించాలని, కేజీబీవీ సిబ్బందిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

‘నకిలీ పోలీసులను గుర్తించాలి’

ఆదిలాబాద్‌టౌన్: పోలీసుల పేరిట వాహనాలు ఆపి తనిఖీ చేసేవారిని గుర్తించి వెంటనే సమాచారం ఇవ్వాలని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి సూచించారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బంగారు ఆభరణాలు, డబ్బులు, విలువైన వస్తువులు అడిగితే వారు పోలీసులు కాదనే విషయాన్ని గ్రహించాలని సూచించారు. ఆదివారం బేల మండలంలో పోలీసులమని నమ్మించి ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన గురించి వివరించారు. బాధితులు బేల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నలుగురు నిందితులపై కేసు నమోదైనట్లు తెలిపారు. బేల మండలంలో మోసం చేసిన వారు మధ్యాహ్నం 12 గంటలకు నిర్మల్ జిల్లాలోని లక్ష్మణచాంద వద్ద మరో మోసం చేసి బంగారం అపహరించారని పేర్కొన్నారు. వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను నియమించినట్లు వివరించారు. ఇలాంటి ఘటనలే ఉట్నూర్, ఇచ్చోడ ఠాణాల పరిధిలో ఇదివరకే జరిగినట్లు పేర్కొన్నారు.

దొంగలను పట్టించిన సీసీ కెమెరా

బెల్లంపల్లి: ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డవారిని సీసీ కెమెరా పట్టించింది. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 18న రాత్రి కాల్‌టెక్స్ ఏరియాలో నివాసముంటున్న దాసరి జ్యోతి ఇంట్లో పెండ్లి భరాత్ జరిగింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో అదనుచూసి సిరిగిరి స్వప్న, ఇద్దరు మైనర్లు ఇంట్లోకి చొరబడ్డారు. బంగారం, డబ్బులు దొంగిలించారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఇంట్లో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలోని పుటేజీలను పరిశీలించారు. చోరీకి పాల్పడ్డ నిందితులను గుర్తించి సోమవారం అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీసీ కెమెరా ఏర్పాటు చేసుకున్న ఇంటి యజమానిని సీఐ అభినందించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని, నిందితులను సులభంగా గుర్తించవచ్చని పేర్కొన్నారు. ఈ మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

ఉరేసుకుని వృద్ధురాలి ఆత్మహత్య

సిర్పూర్(టి): మండలంలోని డోర్‌పల్లి గ్రామానికి చెందిన ఆడె భీమక్క (72) ఇంటి సమీపంలోని వేపచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు, ఎస్సై కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. భీమక్కకు ఒక కొడుకు ఉండగా అతడి భార్య కాపురానికి రావడంలేదు. దీనిపై కోర్టులో కేసు నడుస్తోంది. దీంతో మనస్తాపానికి గురైన భీమక్క సోమవారం ఇంటి సమీపంలోని వేపచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమార్తె సూర పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రత్నాపూర్‌లో గుర్తు తెలియని వ్యక్తి..

నిర్మల్ టౌన్: నిర్మల్ రూరల్ మండలం రత్నాపూర్ గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడి వయస్సు 40-50 ఏళ్ల మధ్య ఉంటుందని, ఎవరైనా గుర్తుపడితే సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై శ్రీధర్

జైపూర్: మండలంలోని టేకుమట్ల రోడ్డు సమీపంలో ఇందారం ప్లాంటేషన్ వద్ద గంజాయి విక్రయించేందుకు వచ్చిన సుల్తానాబాద్ పట్టణానికి చెందిన రాటే నగేశ్, చౌతాకారి శ్రీకాంత్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన నగేశ్, శ్రీకాంత్ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు బైక్‌పై వెళ్లి అక్కడి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి సుమారు 500 గ్రాముల గంజాయి కొనుగోలు చేస్తుంటారు. అందులో కొంత సేవించి మిగతా దాన్ని ప్యాకెట్లుగా చేసి రూ.500 చొప్పున విక్రయించేవారు. వచ్చిన డబ్బులతో మద్యం తాగుతూ జల్సా చేసేవారు. ఈ క్రమంలో అక్కడ గంజాయి కొనుగోలు చేసి స్థానికంగా విక్రయించేందుకు తెస్తుండగా సోమవారం వారిని పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. వారి నుంచి 102 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

దాడికి పాల్పడ్డ ముగ్గురి అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

భీమిని: కన్నెపల్లి మండలం టేకులపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఓ వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిని అరెస్ట్ చేసి బైండోవర్ చేసినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భీమిని మండలం మల్లీడి గ్రామానికి చెందిన పెద్దపల్లి ప్రశాంత్ సోమవారం కన్నెపల్లి మండలంలోని టేకులపల్లి గ్రామంలో చేపట్టిన తన ఇంటి నిర్మాణ పనుల్లో ఉన్నాడు. మల్లీడి గ్రామానికి తన బంధువులైన పెద్దపల్లి నగేశ్, పెద్దపల్లి గణేశ్, పెద్దపల్లి సురేశ్ పాతకక్షలతో ప్రశాంత్‌పై చేతులు, కర్రలతో దాడి చేశారు. ప్రశాంత్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలి పారు. మరోసారి గొడవ పడకుండా తహసీల్దార్ శ్రవణ్‌కుమార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

నస్పూర్‌లోని ఓ ఇంట్లో చోరీ



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న సీఐ అశోక్

నస్పూర్: పట్టణ పరిధిలోని ఓ ఇంటిలో చోరీ జరిగినట్లు మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కాకతీయ హిల్స్‌లో నివాసముండే భూపెల్లి లావణ్య ఈ నెల 18వ తేదీన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి గోదావరిఖనికి పెళ్లికి వెళ్లింది. ఈనెల 21న తిరిగి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూసి 14 తులాల బంగారు ఆభరణాలు, రూ.5వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనాస్థలికి చేరుకుని ఇల్లు, పరిసరాలు పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మూడు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

కటకటాల్లోకి నెట్టిన ఇన్‌స్టాగ్రామ్ పరిచయం

- ప్రేమ పేరిట యువతిని వంచించిన యువకుడు
- లైంగికదాడికి పాల్పడి ఆమెతో పెళ్లికి నిరాకరణ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధిత యువతి

మంచిర్యాలక్రైం: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఓ యువతిని ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేసిన ఓ యువకుడిపై ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసు నమోదు చేసి కటకటాల్లోకి పంపించినట్లు ఏసీపీ రత్నపురం ప్రకాశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లక్సెట్టిపేటకు చెందిన ఓ యువతి డిగ్రీ పూర్తి చేసి మంచిర్యాలలో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో లక్సెట్టిపేటకు చెందిన పొన్నం వినయ్ ఇన్‌స్టాగ్రాంలో సదరు యువతికి పరిచయమయ్యాడు. కొంతకాలంగా ఇద్దరూ ఇన్‌స్టాగ్రాంలో చాటింగ్ చేసుకున్నారు. వీరి పరిచయం ప్రేమ, పెళ్లి వరకు వెళ్లింది. వినయ్ పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి 2024 జూన్ 14న సదరు యువతిని మంచిర్యాలలో కలిసి లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం పెళ్లి ప్రస్తావన తేగా వినయ్ సదరు యువతి క్యారెక్టర్‌ను అనుమానించాడు. అందంగా లేవని బూతులు తిట్టాడు. పెళ్లికి నిరాకరించడమే కాకుండా బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో మోసపోయానని గ్రహించిన సదరు యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి తగిన సాక్ష్యాధారాలతో వినయ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

‘అంబేడ్కర్ విధానాలను కాలరాసిన కాంగ్రెస్’

ఆదిలాబాద్: అంబేడ్కర్ విధానాలను అధికారంలో ఉన్న 60 ఏళ్లపాటు కాంగ్రెస్ కాలరాసిందని ఎంపీ గోడం నగేశ్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్ ఆరోపించారు. అంబేడ్కర్ జయంత్యుత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జిల్లా సదస్సు నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాలకూ అంబేడ్కర్ చేసిన సేవలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి పెద్దపీట వేసింది బీజేపీ మాత్రమేనని చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, నాయకులు అస్తక్ సుభాష్, పాయల్ శరత్ తదితరులున్నారు.

నివాళులర్పిస్తున్న ఎంపీ నగేశ్, మహేందర్ →

